క్లుప్తంగా

పకడ్బందీగా వంద రోజుల ప్రణాళిక



నర్సాపూర్‌లో మురికి కాలువ నుంచి మురుగును తొలగిస్తున్న పారిశుద్ధ్యం సిబ్బంది

నర్సాపూర్: ప్రభుత్వం మున్సిపాలిటీలలో చేపట్టిన వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని నర్సాపూర్‌లో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో పర్యటించి పనులను పర్యవేక్షించారు. డంప్‌యార్డు వద్ద తడి, పొడి, హానికర చెత్త వేరు చేసే ప్లాంట్‌ను పరిశీలించారు. పట్టణంలో సామూహిక పారిశుద్ధ్యం పనులు, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ పనులు తదితర పనులు పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలను పంపిణీ చేస్తున్న ఈజీఎస్ క్షేత్ర సహాయకుడు దశరథ్ నాయక్

రేగోడ్(మెదక్): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఈజీఎస్ క్షేత్ర సహాయకుడు దశరథ్ నాయక్ అన్నారు. మండలంలోని కొండాపూర్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం గ్రామస్తులకు ఒక్కొక్కరికి బొప్పాయి, మునగకాయ రెండు మొక్కల చొప్పున సుమారు 90 మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటి పెంచాలని కోరారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మర్రిచెట్టుతండాలో విద్యార్థులకు సోమవారం ఐడీ కార్డు, టై, బెల్టులను సలాబత్‌పూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, మర్రిచెట్టుతండా హెచ్‌ఎం హరీశ్వరీ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందని తండావాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషగిరిరావ్, నాగుల్‌మీరా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న ప్రవీణ్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో కార్మికులకు సోమవారం పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు నెలకు సరిపడా సబ్బులు, కొబ్బరినూనె, పప్పులు ఇతర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు అశోక్, బాగులు తదితరులు పాల్గొన్నారు.

రినోవేషన్ కమిటీ

రామాయంపేట(మెదక్): స్థానిక మహంకాళీ ఆలయ రినోవేషన్ కమిటీ కార్యవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రిన్సిపాల్ కార్యదర్శి శైలజ రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సభ్యులుగా దారం సంతోష్, దోమకొండ యాదగిరి, మర్కు గంగారాం, భైరం స్వప్న, పిట్ల ప్రకాశ్, అనిత, భూమ కిషన్, గూడాల లింగం, బీర రామచంద్రం, మంగళి సతీశ్, మంజుల, సామల రవి నియమితులయ్యారు. నూతన కమిటీని నియమించినందుకుగాను పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు ముఖ్యమంత్రికి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

పప్పు దినుసుల సాగుకు ప్రోత్సాహం



రైతులకు మినుముల బ్యాగులు అందజేస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): పప్పు దినుసుల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి కృష్ణ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేట మండలానికి జాతీయ ఆహార భద్ర పథకం (ఎన్ఎఫ్ఎస్ఎం) ద్వారా మంజూరైన 250 మినుము (4 కిలోల చొప్పున) బ్యాగులను రైతులకు ఏఓ అందజేశారు. మండలంలో పప్పు దినుసుల సాగును పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రైతులు అంతరపంటగా సాగు చేసుకోవడం వల్ల ఆర్థికంగా లాభాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు వినీత్, అఖిల్ హుస్సేన్, మమత తదితరులున్నారు.

ఘనంగా వన మహోత్సవం



వన మహోత్సవంలో పాల్గొన్న అధికారులు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధికారులు

మనోహరాబాద్(తూప్రాన్): మొక్కలతో భవిష్యత్తు జీవన గమనానికి ఎంతో మేలు జరుగుతుందని ఎఫ్ఆర్ఓ అంబర్‌సింగ్ అన్నారు. సోమవారం మనోహరాబాద్ మండలంలోని రంగాయపల్లి శివారులో వనమహోత్సవం కార్యక్రమాన్ని ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫారెస్ట ఆధ్వర్యంలో తమ పరిధిలో భారీగా మొక్కలు నాటి వాటి సంరక్షణ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, డీప్యూటి ఎఫ్ఆర్ఓ చంద్రశేఖర్, రంగాయపల్లి హెచ్‌ఎం సంజీవరావు, ఏపీఓ ఆదినారాయణ, ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి మొక్కను సంరక్షించాలి..

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం అటవీశాఖ అధికారులు మంజీరా విద్యాలయంలో విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. అనంతరం వారు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులతో పాటు ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు పాల్గొన్నారు.

చిన్నగొట్టిముక్లలో..

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం అటవీ, విద్యాశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల మొక్కలను నాటి నీరు పోశారు. శివ్వంపేట ఫారెస్టు సెక్షన్ అధికారి శ్రీధర్‌కుమార్, హెచ్‌ఎం ఇందుమతి మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను పరిరక్షించడంలో విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాజాపూర్‌తండాలో

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ తండాలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ప్రవల్లిక ఆధ్వర్యంలో 100 మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ డిప్యూటీ రేంజర్ గీతా, సెక్షన్ ఆఫీసర్ కృష్ణాగౌడ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యత

వెల్దుర్తి(తూప్రాన్): వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తిలోని శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అటవీశాఖ అధికారులు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. భవిష్యత్ తరాలకు సుస్థిర వాతావరణాన్ని కల్పించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పలువురు పిలుపునిచ్చారు. మొక్కలు నాటడంతోనే సరిపెట్టుకోకుండా వాటి సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, తదితరులు

ఎమ్మెల్యే సునీతారెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఖరీదైన వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం ఆమె మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, షఫీ, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొల్చారంలో ..

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లికి చెందిన ఎర్ర దేవయ్యకు సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి రూ.23,500ల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేష్ కుమార్,మండల పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్,పార్టీ నాయకులు నరేందర్ రెడ్డి, సంతోష్ ,వేమారెడ్డి, యాదయ్య,సిద్ధిరాములు,రవితేజ రెడ్డి, ఆంజనేయులు,తదితరులు ఉన్నారు.

అడ్మిషన్ల గడువు పెంపు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో 2025–2026 విద్యాసంవత్సరానికి గాను పదోతరగతి, ఇంటర్మీడియెట్‌లలో అడ్మిషన్ల గడువును 31 వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ వెంకటస్వామి(80084 03635)ని సంప్రదించాలని సూచించారు.

పనిచేసే చోట రెండుసార్లు ఫొటో తీయాలి

ఎంపీడీఓ శ్రీనివాస్



ఉపాధిహామి టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధి హామీ పనులు జరిగే చోట కూలీలకు సంబంధించి రెండుసార్లు ఫొటో తీయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధిహామి పనికి రాగానే ఫీల్డ్ అసిస్టెంట్ లేదా మేట్ ఫొటో తీయాలన్నారు. అనంతరం నాలుగు గంటలపాటు పనిచేసిన తర్వాత మరోసారి ఫొటో తీయాలని చెప్పారు. రెండు సార్లు తీసిన ఫొటోలను ఎంపీఓకు ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. అలాచేస్తేనే కూలీ వస్తుందని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏలు అనుమతి లేకుండా గైర్హాజరైతే చర్యలు తప్పవన్నారు. వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో ఆదాయం

మండల ఉద్యానవన అధికారి సంతోష్



పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి సంతోష్

రేగోడ్(మెదక్): ఆయిల్ పామ్ సాగుతో రెట్టింపు ఆదాయం పొందవచ్చని మండల ఉద్యానవన అధికారి సంతోష్ రైతులకు సూచించారు. మండలంలోని మర్పల్లి గ్రామంలోని ఆయిల్‌పామ్ పంటను ఏఓ జావిద్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి వసతి ఉండి పత్తి, వరిసాగు చేసే రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలని తెలిపారు. ఒక ఎకరా వరి సాగుకు సరిపోయే నీటితో నాలుగు ఎకరాల ఆయిల్ పామ్ తోట సాగు చేయవచ్చని అన్నారు. ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా కంపెనీ అధికారులే ఆయిల్ గెలలను కొనుగోలు చేస్తారని, ఎకరానికి 57 చెట్లు వేసుకోవచ్చని చెప్పారు. ఒక చెట్టు రూ.200 ఉంటే ప్రభుత్వం రూ.20లకే రైతులకు అందిస్తుందని తెలిపారు. డ్రిప్‌లో కూడా ఎస్సీ, ఎస్టీ రైతులకు 100%, బీసీ రైతులకు 90% శాతం ఓసీ రైతులకు 80% సబ్సిడీ లభిస్తుందని, ఆయిల్ పామ్ వేసుకున్న రైతులకు రైతుబంధుతో పాటు సంవత్సరానికి రూ.4200 ఎకరానికి సాగు ఖర్చుల కింద ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. రైతులందరూ ఆయిల్ పామ్ సాగుపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

అధిక దిగుబడులు..

మనోహరాబాద్(తూప్రాన్): ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభం చేకూరుతుందని మండల వ్యవసాయ విస్తరణ అధికారి నరేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం మనోహరాబాద్ మండలం కోనాయపల్లి(పీటి) గ్రామంలో కల్యాణ్ రైతు రెండున్నర ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు కోసం చెట్లను నాటారు. వీటి వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నె కళ్యాణ్, సుధాకర్, పవన్‌కుమార్‌గౌడ్, మోతుకు రమేష్, రాజు, లీప్‌పాం కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ నిశాంత్ పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

మెదక్ కలెక్టరేట్: కులం పేరుతో దూషించి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ... ఇటీవల శివ్వంపేట మండలం బిజిలీపూర్‌లో గ్రామానికి చెందిన కొందరు తమను అకారణంగా కులం పేరుతో దూషించి దాడి చేశారని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో దాడి చేసిన వారు తమను నిత్యం చంపుతామని బెదిరిస్తూ భయబ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధితులు చిట్యాల పెద్దొల్ల నవీన్‌తోపాటు కొంత మంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో నాగుపాము



హతమైన నాగుపాము

రామాయంపేట(మెదక్): మండలంలోని దామరచెరువు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చొరబడిన నాగుపామును గ్రామస్తులు చంపారు. ఆ సమయంలో విద్యార్థులెవరూ కేంద్రంలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పామును చూసిన టీచర్ ఈ విషయమై గ్రామస్తులకు సమాచారం తెలుపగా వారు వచ్చి హతమార్చారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని దళిత కాలనీవాసులు సోమవారం తహసీల్దార్ రజనికుమారికి వినతిపత్రం అందజేశారు. ట్రాన్స్‌ఫార్మర్ తొలగిస్తేనే ఇళ్ల నిర్మాణం ప్రారంభమవుతుందని, ఈ విషయమై విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు.

విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ



విద్యార్థినులకు యూనిఫాంల పంపిణీ



నోట్‌బుక్స్ పంపణీ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు సోమవారం రెండో విడత యూనిఫాంలను హెచ్‌ఎం సాజిద్ అలీ, ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు, నాణ్యమైన భోజనం, రెండు జతల యూనిఫాంలను పంపిణీ చేస్తుందని తెలిపారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీ రమేష్, వీఓఏ ఏసు ఉపాధ్యాయురాలు అనిత తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్కుల పంపిణీ

మండలంలోని ధర్మాసాగర్, సదాశివపల్లి, పాంపల్లి, బూరుగడ్డ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, డ్రాయింగ్‌బుక్, పెన్నులు, కలర్ పెన్సిల్స్, స్కేల్, పెన్‌పౌచ్, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సర్వీస్ డైరెక్టర్ చక్రవర్తిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అభివృద్ధికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తమ వంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాగా విద్యార్థులు శ్రద్ధగా చదివి అభివృద్ధిలోనికి వచ్చి ఇతరులకు సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు హనుమంత్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, శంకర్, రిషీ, మాజీ సర్పంచ్ ఆశమ్మ, నాయకులు సత్యనారాయణరెడ్డి, సంతోష్‌గౌడ్, నవీన్, హెచ్‌ఎం దివ్య, ఉపాధ్యాయురాలు కోమలి, అంగన్‌వాడీ టీచర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ



ఆర్యవైశ్య కమిటీని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): మండల నూతన ఆర్య వైశ్య సంఘాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కన్నయ్యగారి రమేష్, ప్రధాన కార్యదర్శిగా శివశంకర్, కోశాధికారిగా బెజుగం అమర్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, తదితరులున్నారు.

విద్యార్థులకు సన్మానం



భావనను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు, ఎంఈఓ

వెల్దుర్తి(తూప్రాన్): పదవ తరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను కట్లె సత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ తరపున సోమవారం సన్మానించారు. ప్రథమ స్థానంలో నిలిచిన గుంటుకు భావన, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన చంద్రవర్ధన్, శ్రీచరణ్‌లతో పాటు జిల్లా స్థాయిలో కామిక్ కాంపిటేషన్‌లో ప్రథమ స్థానం సాధించిన కీర్తన లకు నగదు ప్రోత్సాహకం అందజేసి శాలువాలతో సత్కరించారు. ట్రస్ట్ తరపున ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు అందజేసిన ట్రస్ట్ నిర్వాహకుడు నరేందర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఎంఈఓ యాదగిరి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాంబయ్య, ట్రస్ట్ అధ్యక్షుడు స్వరూప, వైస్ చైర్మన్ విజయలక్ష్మి, నర్సింలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



మోహన్‌నాయక్‌ను కండువా కప్పి కాంగ్రెస్‌లో ఆహ్వానిస్తున్న హనుమంతరావు

నిజాంపేట(మెదక్): కొంత కాలంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మోహన్‌నాయక్ సోమవారం మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు నిజాంపేట మండల పరిధిలోని జెడ్ చెరువు తండాలో తన స్వగృహంలో హనుమంతరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. హనుమంతరావు మాట్లాడుతూ సేవ కార్యక్రమాలు చేపడుతున్న డా. మోహన్‌నాయక్ రాజకీయాల్లోకి రావడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను గుండెల్లో పెట్టి చేసుకుంటుందన్నారు. మెదక్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుప్రభాత రావు, సరాఫ్ యాదగిరి, యాదగిరి, చంద్రపాల్, నసీరొద్దిన్ , అమరసేనారెడ్డి, కోమ్మట బాబు, సత్యనారాయణ, రాజేందర్, రాంచందర్, రమేష్ రెడ్డి, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరేణుక ఎల్లమ్మదేవి ఆలయ ఉత్సవాలు



కౌడిపల్లిలోని శ్రీరేణుక ఎల్లమ్మదేవి ఉత్సవాల సందర్భంగా బోనాలతో గంగకు వెళుతున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలోని గౌడ సంఘం శ్రీరేణుక ఎల్లమ్మదేవి ఆలయ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి ఒగ్గుపూజారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కాటమయ్య బోనంతో డోలు వాయిద్యాలతో గంగకు వెళ్లారు. గంగమ్మ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. దీంతోపాటు ఆలయంలో ఒగ్గుపూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఒగ్గుకథ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ జనహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రం కృష్ణాగౌడ్, ఉత్సవ కమిటీ సభ్యులు సత్యనారాయణగౌడ్, దుర్గాగౌడ్, రాజుగౌడ్, వీరేష్‌గౌడ్, రమేష్‌గౌడ్, పెంటాగౌడ్, దశరత్‌గౌడ్, పి మనోహర్‌గౌడ్, వెంకట్‌గౌడ్, సీహెచ్ మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నారు కొనలు తుంచి నాటాలి



వరి నారుపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రాం ప్రసాద్

ఏడీఏ రాం ప్రసాద్

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని రైతులు నారు కొనలు తుంచి నాటు వేసుకోవాలని పెద్దశంకరంపేట ఏడీఏ రాం ప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని అచ్చన్నపల్లి గ్రామ రైతులకు వరిలో భాస్వరాన్ని కరగదీసే బ్యాక్టీరియా గురించి అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరి నారు కొనలు తుంచి నాటుకోవడంతో పురుగుల గుడ్లు ఉంటే తీసివేయవచ్చన్నారు. దీని ద్వారా పురుగు ఉధృతి తగ్గించవచ్చని తెలిపారు. నాటుకు ముందు 2 నుంచి 3 కిలోల భాస్వరం పొడిని 100 కిలోల పశువుల ఎరువులో కలిపి ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలన్నారు. వరి నారు మొదల్లు నీటితో కలిపిన భాస్వరాన్ని కరిగించు బ్యాక్టీరియా ద్రావణంలో 15 నుంచి 30 నిమిషాలు ఉంచి నాటుకోవాలని సూచించారు. అధిక దిగుబడులు పొందాలంటే రైతులు అధికారుల సూచనలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.